

# 'అదే' కథలు

## - ఆర్.శర్మ దంతుర్తి

ముందు మాట – అమెరికా వచ్చిన భారతీయుల్ని 'దేశీ'లంటారని, వారి దైనందిన జీవితాల్లో జరిగే అనేకానేక విషయాలతో అమెరికా దేశీయ కథలు అనే పేరుతో ఈ వరస కథలు మొదలుపెట్టాను, గౌరవం కోసం 'య' అనేది చేర్చి. ఇందులో చర్చించిన సమస్యలు పూర్తిగా కాకపోయినా చాలా మటుక్కు అన్నీ స్వకపోల కల్పనలు – ఇలా జరిగి ఉండొచ్చని ఊహించి రాసినవి. కొన్ని ఇలా జరిగినట్టు ఇంటర్నెట్ మీదా, వార్తల్లోనూ చదివినవి.  అవి మీకు కానీ మీకు తెల్సున్నవాళ్ళకి కానీ జరిగితే అది పూర్తిగా కాకతాళీయం/యాదృచ్ఛికం మాత్రమే. సరదాకి రాసిన ఈ కథలు వినోదంగా చదువుకోవడానికి మాత్రమే. చాలామటుకు నవ్వు వచ్చినా కొన్ని కథల్లో ఏడుపుకూడా రావొచ్చు. ఆ నవ్వులకి, బాధలకి, దుఃఖాలకి నా బాధ్యత లేదు.

## 68

## పిత్రార్జితం

**సుబ్బారావు అమెరికా** వచ్చేసరికి చాలా చిన్నవాడికిందే లెక్క. ఇరవైమూడేళ్ళకి ఎమ్ ఎస్ అయిందనిపించాక ఉద్యోగం, పెళ్ళీ పిల్లలూ వచ్చిచేరేసరికి ఇంకా ముప్పై ఐదేళ్ళ కుర్రాడే. ఎప్పుడైతే జీవితంలో చేరవల్సిన మరో గమ్యం కనిపించదో అప్పుడు బోర్ కొట్టడం మామూలే కదా? ఐఐటిలో చేరకముందు ఎదురుగా ఉండే గోల్ ఐఐటి. అందువల్ల ఆలోచించడానికి సమయం దక్కలేదు. ఐఐటి తర్వాత అమెరికా రావడం గోల్. దాని తర్వాత గ్రీన్ కార్డు. ఇంక మిగిలినది పట్టాభిషేక మహోత్సవం, పిల్లలూ, వాళ్ల చదువులూ వగైరా. ఈ పిల్లలతో ఉన్న గొడవ మరొకటి. వాళ్ళ చదువులంటే ఇండియాలో ఉన్నట్టూ కుదరదు. స్కూల్లో దింపాలి పొద్దున్న బస్సు మిస్సైతే. సాయంత్రం బస్సులో వస్తే వస్తారు లేకపోతే వెళ్ళి తీసుకురావాలి వాళ్ళకి వేరే ఫుట్ బాల్ లేదా బాస్కెట్ బాల్ లాంటి వ్యాపకాలు ఉంటే. పిల్లలు కొంచెం పెద్దైతే ఆ తర్వాత? అందుకే జీవితంలో గోల్ లేక బోర్ కొట్టడం మొదలైంది సుబ్బారావుకి. దానికోసం మరో వ్యాపకం మొదలుపెట్టాడు. అది తన తండ్రి గురించి రీసెర్చ్ చేసి ఆయనేం చేసాడు, డబ్బులన్నీ ఎక్కడ దాచాడు, ఎవరెవరికి ఇచ్చాడు అనే పిత్రార్జితం గురించి వెదకడం.

సుబ్బారావు అమెరికా వచ్చేసరికి తండ్రి ఇంకా రైల్వే ఉద్యోగం లోనే ఉన్నాడు. గవర్నమెంట్/రైల్వేలో పనిచేసే ఉద్యోగం అంటే తెల్సిందే కదా? అప్పుడే దూడపుట్టిన గంగిగోవులాంటిది. పిండుకున్నవారికి పిండుకున్నంత. అలా ఆయన ఇల్లూ, కొంత భూమీ వగైరా సంపాదించాడు. పెద్ద కుటుంబం – సుబ్బారావు తో సహా ఆరుగురు పిల్లలూ, ఆయనకున్న తమ్ముడూ చెల్లెలూ అందరూ ఒకేచోట ఉండేవారు. సుబ్బా అమెరికా వచ్చాక ఉద్యోగం చేసేటపుడు తండ్రి డాలర్లు పంపమని అడిగాడు, ఏదో స్థలం కొంటాట్ట ఆయన ఇండియాలో. తర్వాత ఇంక చెప్పుకోవడానికేముంది? సుబ్బారావు పెళ్ళాం కలగజేసుకుంది – "అలా డబ్బులు ఎందుకు పంపాలి, ఎన్నాళ్ళూ ఈ తతంగం?" అంటూ. అందరి ఎన్నారైల లాగానే ఆవిడా ఆఖరి అస్త్రం ప్రయోగించింది మావగారిమీద– 'ఇక్కడ అమెరికాలో చెట్లకి డాలర్లు కాస్తున్నాయా?' అనే డైలాగ్ వదిలి. ఆవిడ అలా అన్నట్టు మొగుడికి తెలియదు. ఈ మాట వినగానే సుబ్బా తండ్రి అగ్రహోదగ్రుడైపోయేడు. మొన్నటికి మొన్న ఈ కోడలు పిల్ల ఎవరో తమకి తెలియదు. కుర్రాడికి నచ్చింది కదా అని తీసుకొచ్చి పెళ్ళి చేస్తే గుడ్డొచ్చి పిల్లని వెక్కిరిస్తూన్నట్టూ ఏమిటి వాగుతోంది? దానితో ఆయన సుబ్బాతో మాట్లాడ్డం మానేసాడు. ఎప్పుడో తర్వాత ఒకసారి సుబ్బా అమ్మ చెప్పింది ఫోన్ లో 'మీ ఆవిడ ఇలా అందిరా నాన్నతో' అని. ఈయన పని కత్తెరలో పడ్డ పోకచెక్కలా తయారైంది. ఇటు భార్యని ఏమీ అనలేడు, అటు తండ్రితో ఏమీ చెప్పుకోలేని అశక్తత. ఏదైతేనేం, తండ్రితో మొత్తానికి అలా తెగిపోయినట్టే. అయితే అడపా దడపా ఎప్పుడైనా ఎవరికైనా చదువుకో, శుభకార్యానికో కొన్ని డాలర్లు పంపినా తండ్రి దూరంగానే ఉంటూ వచ్చాడు, సుబ్బాకి తెలియకుండా కొన్ని విషయాలు దాచాడేమో కూడా. అయిదారేళ్ళ క్రితం ఆయన కూడా పోయాక ఆస్థుల పంపకంలో తనకేమీ రాదని తెల్సి నోరు మూసుకున్నాడు సుబ్బారావు. ఖర్మ కాలి ఏదైనా వచ్చినా ఆ ఏదో కొద్దిపాటి అస్థి అమెరికా తీసుకురాలేడు. అమ్మితే సుబ్బారావు వరకూ వంతు వచ్చేది రెండో మూడో లక్షలు. అవి అటూ ఇటూ ఫ్లైట్ ఖర్చులంతలేవు. అలా అవన్నీ సుబ్బా చేయి దాటిపోయేయి.

ఇప్పుడు రీసెర్చ్ చేస్తూంటే సుబ్బాకి ఏదో గుర్తొచ్చింది. తండ్రి ఎప్పుడో ఓ మూల పల్లెటూర్లో ఎలాగ కొన్నాడో తెలియదు కానీ చిన్న స్థలం కొన్నాడు. దాని సంగతి ఏమైందో? అందరికీ ఫోన్లు చేసి కనుక్కుంటే అవును అలా కొన్నట్టు గుర్తుంది కానీ దాని తాలూకు కాయితాలు కనిపించడం లేదు. దాన్ని అక్కడితో వదిలేస్తే పోను కానీ మన సుబ్బారావుగారి క్యూరియాసిటీ ఆయన్ని ఇంకా ముందుకి నడిపించింది. మిగతా వాళ్ళకి ఫోన్లు చేసి, అక్కడ్నుంచి మరో కొంతమందిని పట్టుకునీ విషయాలు సంపాదించాడు. స్థలం ఉన్న ఊళ్ళో ఓ పెద్దాయన అప్పులిస్తాడుట ఇటువంటివాటికి. ఆయన దగ్గిర నుంచి అప్పుచేసి కొన్నాడు స్థలం తన తండ్రి. ఆ స్థలం ఈ పాటికి రెండుమూడు కోట్లకి పడగలెత్తి ఉండొచ్చు. మరోసారి అందరికీ ఫోన్లు కొట్టి ఈ అప్పు ఇచ్చిన పెద్దాయనకి ఫోన్ కలిపితే ఆయన క్లుప్తంగా చెప్పాడు – "అవును రండి మా ఊరికి; కాయితాలు నా దగ్గిరే ఉన్నాయి. అన్నీ చూద్దాం."

టట్టడాం! తన్నకుండా బూర్లె గంపలో పడ్డట్టే కదా, అలా సుబ్బరావు పెళ్ళాం ఎంత చెప్తున్నా, వద్దన్నా వినిపించుకోక దేశం వచ్చాడు ఊర్లో పెద్దాయనతో మాట్లాడ్డానికి.

పెద్దాయన తన దగ్గిరున్న కాయితాలు చూపించి చెప్పాడు – "ఇదిగో మీ నాన్న ఇక్కడ సంతకం పెట్టాడు, ఇలా కొన్నాడు, ఇంత అయింది అప్పు. వడ్డీ ఇంత; స్థలం ఇంకా అలాగే ఉంది. వెళ్ళి చూద్దాం తర్వాత. కానీ ఇందులో ఓ తిరకాసు ఉంది అమ్మడానికి. చాలా కాలం నుండి స్థలం మీద పన్ను ఎవరూ కట్టకపోతే ఈ పెద్దాయన కట్టాడు."

ఓనర్ సుబ్బరావు తండ్రి అయినా సరే; ఇదంతా ఎందుకంటే సుబ్బారావు తండ్రి బాగా తెలుసున్నవాడు కనక. మొత్తం పన్ను బకాయిలు ఇన్నేళ్లకి దాదాపు మూడూ లక్షల దాకా ఉంది. ఇవన్నీ తాను జేబులోంచి కట్టినట్టూ పెద్దాయన ప్రూఫ్ చూపించాడు కూడా; పెద్దాయన ఇచ్చిన అప్పుమీద వడ్డీ కూడా మరో ఆరు లక్షలైంది. సుబ్బారావు తండ్రీ, ఆయనా రాసుకున్న స్టాంప్ పేపర్ మీద పత్రాలూ అవీ చూపించాడు. ఇవన్నీ తీర్చాలి ముందు – మొత్తం తొమ్మిది లక్షలు. తర్వాత సుబ్బారావుదే స్థలం; అవును నిజంగా రెండు కోట్లు చేస్తుంది ఆ స్థలం ఇప్పుడు. స్థలం చూపించి వెనక్కి వచ్చాక పెద్దాయన తన ఇంట్లో వెండి కంచంలో భోజనం పెట్టించాడు కూడా సుబ్బారావుకి.

సుబ్బా చెప్పాడు – ఆ పత్రాలన్నీ కాపీ చేసి ఇస్తే తాను అమెరికా వెళ్ళి తొమ్మిది లక్షలూ పంపిస్తాడు వెంటనే. తర్వాత వచ్చి స్థలం అమ్ముకుంటాడు. ఓకే డోకే అన్నాక సుబ్బా అమెరికా వచ్చి ఉన్నదాంట్లో డబ్బులన్నీ ఊడ్చి తొమ్మిది లక్షలకి పెద్దాయనకి చెక్కు పంపిస్తూ తాను మళ్ళీ ఇండియా ఎప్పుడు రావాలో చెప్పమని రాసాడు ఉత్తరం. ఆరు వారాలకి సుబ్బాకి రెండు కాయితాలు వచ్చాయి పోస్టులో. మొదటిది తాను ఇండియా పంపిన చెక్కు పెద్దాయన కేష్ చేసుకున్నాడని అమెరికన్ బేంక్ పంపిన స్టేట్ మెంట్. రెండోది ఒక చిన్న ఉత్తరం ఇండియానుంచి, ఎవరో లాయర్ రాసినది. మీరు ఫలానా అయితే ఇందులో పంపుతున్న కాపీ మీ నాన్నగారు, ఫలానా అప్పు ఇచ్చిన ఆసామీ రాసుకున్న పత్రం. దీని ప్రకారం మీ నాన్న గారు కొన్న స్థలం మీద ఫలానా ఇన్నేళ్ళు పన్ను కట్టకపోయినా, అప్పులో వడ్డీ కట్టకపోయినా ఆ స్థలం అప్పుఇచ్చిన ఆసామీ ఆ పెద్దాయనకి చెందుతుంది. అలా ఇన్నేళ్ళు, ఆ పైన మరో నాలుగేళ్ళు గడిచాయి. అందువల్ల మీకూ మీ తోటి తమ్ముళకీ, బంధువులకీ ఎవరికీ దీనిమీద హక్కు లేదు. దీనిమీద మీకు ఏవైనా ప్రశ్నలు ఉంటే ఈ కింది ఎడ్రస్ కి సమాధానం ఇవ్వగలరు. నోట్: ఈ స్థలం రిజిస్ట్రేషన్ చేసినపుడు మీ పేరు కానీ మీ అన్నదమ్ముల, అక్కా చెళ్ళెళ్ల పేర్లూ గానీ ఏమీ ఇవ్వలేదు. మీ నాన్నగారి పేరు ఒకటే ఉంది. అందువల్ల మీరు కోర్ట్ లో కేసు వేసే మాట అయితే రెండు విషయాలు గమనించగలరు. ఒకటి మీరు ఫలానా వారి అబ్బాయి అని ఋజువు చూపించే పత్రం కోర్టు సన్నిధికి సమర్పించుట, రెండు, ఏ లావాదేవీలైనా ఇండియన్ కోర్టులో మాత్రమే జరపబడతాయి అని గ్రహించుట.

మతిపోయిన సుబ్బారావు పెద్దాయనకి మరోసారి ఫోన్ చేస్తే ఆయన చెప్పాడు మొహం మీద పేడనీళ్ళు జల్లుతూ – "డబ్బులు అందాయి, మా లాయర్ గారు సమాధానం ఇచ్చారుట, నేను ఇంక ఏమీ మాట్లాడకూడదు మీతో" అని చెప్పారు.

మొత్తానికి లెక్కపెట్టుకుంటే డాలర్ డబ్బై రూపాయల లెక్కన అక్షరాలా దాదాపు పదమూడువేల డాలర్లకి పెద్దాయన సుబ్బారావు చెవిలో పువ్వు పెట్టాడు. పువ్వు అనడం కంటే చెట్టు పెట్టాడనుకోవడం మంచిది. ఇప్పుడున్న ఒకే దారి ఆ పెద్దాయన్ని కోర్ట్ కి ఈడవడం. అంటే ఈ కేసు తేలేదాకా ప్రతీసారీ ఇండియా వెళ్ళి వాదించడం. మరో లాయర్ కి ఫీజు. ఎప్పటికి తేలుతుందో తెలియని వ్యవహారం. తన పేరు ఎక్కడా లేదు కనక తాను చేయగలిగేది దాదాపు శూన్యం. ఈ పెద్దాయన తన దగ్గిర్నుంచి డబ్బులాగే దాకా తండ్రీ ఆయనా రాసుకున్న ఎగ్రిమెంట్ తనకి చూపించలేదు; ఎందుకు చూపించాలి అయినా?

ఇలా బేరీజు వేసుకున్నాక తెల్సిందేమంటే అనగనగా ఒకానొకపుడు తన తండ్రి స్థలం కొంటానంటే తన ముద్దుల భార్య కోపంగా 'ఇక్కడ డాలర్లు చెట్లకి కాస్తున్నాయా?' అంది కదా? అప్పుడు తండ్రికి కోపం వచ్చి పెద్దాయన దగ్గిర అప్పు తీసుకుని తన పేరు ఎక్కడా లేకుండా చేసాడు. ఇచ్చిన పెద్దాయనకి అప్పు మీద వడ్డీ, స్థలం మీద పన్ను తాను కట్టుకున్నాడు. ఇదీ తన పిత్రార్జితం. అందులో వెనక్కి వచ్చేది బండి సున్నా. ఎందుకంటే సుబ్బారావు స్వంతంగా ఇచ్చుకున్నాడు పెద్దాయనకి డబ్బులు. సుబ్బా డబ్బులు పెద్దాయనకి ఎందుకు ఇచ్చాడో అవన్నీ ఎక్కడా కాయితం మీద పెట్టలేదు. ఆయన అడగనూ లేదు. 'నేను వద్దంటూంటే ఎందుకు ఇండియా వెళ్ళారని' సుబ్బా వాళ్ళావిడా, 'నీకెందుకు నోరుమూసుకో' అని ఈయనా దెబ్బలాడుకున్నా ఏమీ తేలలేదు, ఏం చేయాలో. ఇలా కొన్నాళ్ళు తన్నుకున్నాక అన్నింటికన్నా ఉత్తమం ఏమిటో తెల్సి వచ్చింది. ఊరుకున్నంత ఉత్తమం లేదు; డబ్బులన్నీ తిరుక్షవరం చేయించుకున్నాక బోడి గుండంత సుఖం లేదు. ఎలాగా నెగ్గలేరని తెలిసీ కోర్టులో కేస్ వేసి, చివరకి ఓడిపోయి, మిగతా ఖర్చులు కట్టుకుంటూ నిండా మునగడం అనవసరం కదా?

నీతి: బహు పరాక్! పిత్రార్జితాలూ అన్నీ లాభసాటివి కాకపోవచ్చు.

Post your comments